క్లుప్తంగా

వరసిద్ధునికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం నిత్య అన్నదాన ట్రస్టుకు మంగళవారం ఓ దాత నగదు విరాళం అందించారు. తిరుపతికి చెందిన గుండాల్‌రెడ్డి రూ.లక్ష అన్నదాన ట్రస్టుకు విరాళంగా ఇచ్చారు. ఆలయ సిబ్బంది దాత కుటుంబానికి ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు.

ఇందిరమ్మ కాలనీలో గంగమ్మ జాతర



అమ్మవారికి అంబలి సమర్పిస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం గంగ జాతర ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా ఉదయం అమ్మవారి అంబలి, సాయంత్రం పొంగళ్లు సమర్పించారు. రాత్రి అమ్మవారిని గ్రామంలో ఊరేగించి నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువు దీర్చనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం సాయంత్రం అమ్మవారిని మేళతాలు, బాణసంచా వేడుకల నడుమ జలప్రవేశానికి తరలించనున్నట్లు తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న డీలర్లు

గుడిపాల: నూతన తహసీల్దార్‌కు వచ్చిన పూజారి శ్రీనివాసులుకు మంగళవారం మండల రేషన్ డీలర్లు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని రేషన్‌కార్డు లబ్ధిదారులకు డీలర్లు సకాలంలో నిత్యావసర సరుకులను అందజేయాలన్నారు. ప్రతి ఒక్క డీలర్ సకాలంలో డీడీలు చెల్లించి లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు ఇవ్వాలన్నారు.

ప్రతి గ్రామంలో వైద్యసేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: ప్రతి గ్రామానికి వెళ్లి వైద్యసేవలను అందిస్తునున్నట్లు బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత అన్నారు. కుప్పిగానిపల్లె గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రోగికి వారి విషయాలను తెలుసుకుని వైద్యసేవలు అందించి పలు సలహాలు, సూచనలను అందజేస్తున్నామన్నారు. ఎవరైనా నడవలేని పరిస్థితుల్లో ఉంటే వారి ఇంటివద్దకే వెళ్లి వైద్యం అందజేస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రతి బుధవారం, శనివారం ప్రత్యేకంగా ఆయుష్మాన్ భవన్ మందిర్‌లో రక్తపరీక్షలు చేసి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. మధుమేహం, బీపీలతో ఇతర వ్యాధులకు సంబంధించి 55 మందికి వైద్యసేవలను అందజేసి వారికి ఉచితంగా మందులు, మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సరళ, శివగామి, ప్రవీణ్ పాల్గొన్నారు.

పిల్లల్లో సరిపడా ఎత్తు, బరువు ఉండాలి



పిల్లల బరువును పరిశీలిస్తున్న అధికారులు

తవణంపల్లె: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆరేళ్లలోపు పిల్లలే సరిపడా ఎత్తు, బరువు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఐరాల సీడీపీఓ నిర్మల తెలిపారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండు రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. పూతలపట్టు, ఐరాల, తవణంపల్లె మండలాల్లోని 213 అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువు పరిశీలించి నమోదు చేసినట్లు వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం: అబకలదొడ్డి వద్ద ఉన్న ప్రభుత్వ ఐటీఐలో రెండవ విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శేషారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జూలై 15 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జూలై 17వ తేదీ లోపు ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకుని 21న అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

ఫలరాజు విలవిల

గిట్టుబాటు ధర లేక, ట్రాక్టర్లో ఉన్న కాయలను రోడ్డుపై పారబోస్తున్న రైతు



మామిడి తోటల్లో చెట్ల నుంచి రాలిపోయిన కాయలు





- మామిడి చెట్ల నుంచి రాలిపోతున్న కాయలు
- ర్యాంపుల దగ్గర కిలో రూ.2 పలుకుతున్న వైనం
- గిట్టుబాటు ధరలపై నోరు మెదపని ఫ్యాక్టరీలు
- మామిడి రైతుల్లో నైరాశ్యం
- చెట్లను నరికివేస్తున్న వైనం

తవణంపల్లె: ఫలరాజుగా ఖ్యాతికెక్కిన మామిడిని పండించిన రైతులు మాత్రం నష్టాలతో విలవిల్లాడిపోతున్నారు. ఈ పంట దిగుబడి ఈ సారి అంచనాలకు మించి రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే ఊహించని స్థాయిలో ధరలు పతనం కావడంతో నష్టాలు మాత్రం తప్పలేదు. మండలంలోని మామిడి రైతులు కాయలను కొనుగోలు చేసే వారు లేక ఫ్యాక్టరీలు, ర్యాంపుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మామిడి కాయలు చెట్లలోనే మాగి నేల రాలిపోతుంటే, అధికారులు మాత్రం పక్వానికి వచ్చిన కాయలు కోయాలంటూ చెబుతున్నారు. రైతులు ట్రాక్టర్లకు లోడ్డు చేసి ఫ్యాక్టరీల వద్ద అన్‌లోడ్ చేయడానికి నాలుగురోజుల పాటు నిరీక్షిస్తున్నారు. ఫ్యాక్టరీ యజమానులు ఖాం బర్లు ఖాళీగా లేవని మామాడి కాయల టోకన్లు ఇవ్వకుండా తిరిగి పంపుతున్నారు. రైతులు దిక్కుతోచని స్థితిలో ఆవేదన చెందుతున్నారు.

చేతులెత్తేస్తున్న ఫ్యాక్టరీ యజమానులు

ఫ్యాక్టరీల వద్ద సామర్థ్యానికి మించి కాయలు వస్తున్నాయని తర్వాత టోకెన్లు ఇస్తామని నిర్వాహకులు చేతులెత్తేస్తున్నారు. ఫ్యాక్టరీల వద్ద ట్రాక్టర్లను అన్‌లోడ్ చేయడానికి సుముఖత చూపడం లేదు. ఫ్యాక్టరీకి రైతులు విపరీతంగా కాయలు తరలిస్తున్నా గట్టుబాటు ధలపై నోరు మెదపడం లేదు. ప్రభుత్వం కిలో మామిడి కాయలకు రూ.4 ఇస్తామని ప్రకటించినా ఫ్యాక్టరీ యజమానులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ధరలు ఏమైనా సరే కాయలను తోలుతామని రైతులు ముందుకు వచ్చినా ఫ్యాక్టరీలు ససేమిరా అంటున్నారు.

నేలపాలవుతున్న మామిడి కాయలు

మామిడి కాయలు పండైపోయి కొమ్మల నుంచి నేల రాలిపోతున్నాయి. దీంతో రైతులు మనస్తాపానికి గురవుతున్నారు. కాయలను ఫ్యాక్టరీల యజమానుల తీసుకోకపోవడంతో రైతులు చెట్లలోనే వదిలేయడానికి సిద్ధమవుతున్నారు. మరి కొందరు రైతులు మామిడి చెట్లను నరికి వేయడానికి ఉపక్రమిస్తున్నారు. మాధవరంలో ఓ రైతు కాయలు చెట్టులో ఉండగానే మిషన్‌తో చెట్టునే కోసేశాడు. మామిడి చెట్లను పొలం నుంచి పూర్తిగా తొలగించి ప్రత్యామ్నాయ పంట సాగు చేసుకోవడానికి పూనుకున్నాడు.

ప్రభుత్వం విఫలం

పంటపై ఆధాపడిన మామిడి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతులు మండిపడుతున్నారు. మామిడి పంటను ఫ్యాక్టరీలకు తరలించేందుకు లేక ర్యాంపుల వద్ద విక్రయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టి మామిడి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



మామిడి తోటలో చెట్లను నరికి కుప్పగా పోసిన కొమ్మలు



మామిడి చెట్టును నరుకుతున్న రైతు



దిగువమోదలపల్లె దగ్గర చెట్టు కిందనే రాలిన మామిడి కాయలు

మండల పరిధిలోనే బదిలీలు చేపట్టాలి

బంగారుపాళెం: గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీలను సొంత మండలాల పరిధిలోనే నిర్వహించాలని ఆ సంఘం నాయకులు మంగళవారం ఎంపీడీఓ మహేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. మండల సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటేష్, గౌరి, శివకుమార్, భరత్ మాట్లాడుతూ, గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు కోరుకున్న చోటకు బదిలీ చేసి, ఇతరులను స్థానిక మండలాల పరిధిలో బదిలీలు చేపట్టాలని కోరారు. స్థానిక మండలాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ఇతర మండలాలకు బదిలీ చేసే అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సీనియారిటీ ప్రకారం మెరిట్ కం రోస్టర్ విధానంలో నోషన్ ఇంక్రిమెంట్లు విడుదల చేయాలన్నారు. పదోన్నతులు కల్పించాలని, పే స్కేల్ విషయంలో సమన్యాయం పాటించాలని డిమాండ్ చేశారు.



ఎంపీడీఓకి వినతి పత్రాన్ని అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

వినాయకుని సేవలో కేవీ కమిషనర్



కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్



స్వామి చిత్ర పటం అందుకుంటున్న కమిషనర్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం రాత్రి కేంద్రీయ విద్యాలయ కమిషనర్ నిధి పాండే దర్శించుకున్నారు. కమిషనర్‌కు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఈవో పెంచలకిషోర్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు ఆమెకు ఆశీర్వచనాలు చేయించారు. తర్వాత స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కేంద్రీయ విద్యాలయ వినోద్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు గేట్‌వేగా పలమనేరు!



మూతబడిన పలమనేరు ఆర్టీఓ కార్యాలయం (ఫైల్)

పలమనేరు: అక్రమ రవాణాకు పలమనేరు గేట్‌వేగా మారింది. పట్టణ సమీపంలోని క్యాటిల్ ఫామ్ ఆర్టీఓ చెక్‌పోస్టును మూసివేయడంతో ఈ మార్గంలో వెళ్లే వాహనాలకు పర్మిట్లు, టాక్సులు లాంటివి ఉన్నాయా, లేదా? అని తనిఖీ చేసేవారే లేకుండా పోయారు. ఈ మార్గంలో నెలకోసారి వచ్చే ఆర్టీఓలు తూతూమంత్రంగానే వాహనాలను ఆపి తనిఖీలు చేయడం తప్పితే నిత్యం ఎన్నో వాహనాలు పన్నులు కట్టకుండా వెళ్తాండడంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న ఈ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు అవసరం ఎంతైనా ఉంది.

పట్టణ సమీపంలోని రోడ్డు రవాణా కార్యాలయాన్ని గత ఏడాది మార్చిలో తొలగించారు. డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడం, యాప్ ద్వారా పన్నులు చెల్లింపును కేంద్ర ప్రభుత్వం అమలు చేయడంతో దీనిని మూసివేశారు. ఇక్కడ పనిచేసే అధికారులను అదే శాఖలో స్క్వాడ్ డ్యూటీలు, హెడ్డాఫీసు విధులకు పంపేశారు.

ఆర్టీఓ చెక్‌పోస్టు ఉన్నప్పుడు భయం ఉండేది

గతంలో ఇక్కడ ఆర్టీఓ చెక్‌పోస్టు ఉన్నప్పుడు అన్ని వాహనాలను ఇక్కడ తనిఖీ చేసేవారు. నిబంధనలకు విరుద్ధంగా వెళ్లే వాహనాలు, అధిక టన్నేజి, పర్మిట్లు, సెస్ తదితరాల నిర్వహణ పటిష్ఠంగా చేసేవారు. ముఖ్యంగా మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్నట్లు గుర్తించిన డ్రైవర్లకు జరిమానాలు విధించేవారు. ఇప్పుడు చెక్‌పోస్ట్ లేకపోవడంతో అక్రమ రవాణాకు రాచబాటగా మారింది. ముఖ్యంగా కర్ణాటకకు ఎర్రచందనం, బియ్యం, తమిళనాడుకు గ్రానైట్ తదితర అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కర్ణాటక నుంచి పలు వస్తువులు, ఉత్పత్తులు పన్నులు లేకుండా జిల్లాలోకి చేరుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఇక్కడ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును పునఃప్రారంభిస్తే ప్రభుత్వ ఖజానాకు ఆదాయంతోపాటు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుంది.

డిగ్రీ కళాశాలలపై చిన్నచూపు అన్యాయం

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం డిగ్రీ కళాశాలల పట్ల చిన్నచూపు చూడటం అన్యాయమని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పట్నం సురేంద్రరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇంజినీరింగ్ విద్యకు ప్రాధాన్యతనిస్తూ డిగ్రీ కళాశాలలకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. డిగ్రీ కోర్సు పూర్తి అయినా కూటమి ప్రభుత్వం ఇంత వరకు కళాశాలలకు ఫీజు బకాయిలు చెల్లించలేదన్నారు. స్కూల్ విద్యార్థులకు రూ.13 వేలు, ఇంటర్ విద్యార్థులకు రూ.13 వేలు డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా ఆలస్యం చేయడం తగునా అని ప్రశ్నించారు. డిగ్రీ కోర్సు పూర్తి అయినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోతే ఉన్నత విద్యార్థుల భవిష్యత్, కళాశాలల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇంజినీరింగ్ విద్యకు ఇచ్చినంత ప్రాధాన్యతను కూటమి ప్రభుత్వం డిగ్రీ కళాశాలలకు ఎందుకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలు డిగ్రీ కళాశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పట్నం సురేంద్రరెడ్డి

పశువుల పాకకు నిప్పు

పలమనేరు: పశువుల పాకకు నిప్పు పెట్టడంతో రెండు పాడి ఆవులు మృతి చెందిన ఘటన పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని బొమ్మిదొడ్డిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కుమార్ కాలిఫ్లవర్ తోటలో అదే గ్రామానికి చెందిన నారాయణ అనే వ్యక్తి కాలిఫ్లవర్‌ను చోరీ చేస్తుండడంతో వారు హెచ్చరించారు. దీనిపై కక్ష పెంచుకున్న నారాయణ సోమవారం రాత్రి కుమార్ పశువుల పాకకు నిప్పు పెట్టినట్టు చెబుతున్నారు. దీంతో పాకలోని రెండు పశువులు అగ్నికి ఆహుతయ్యాయి. దీనిపై బాధితుడు కుమార్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

పథకాలు మాకూ వర్తింపజేయాలి

పలమనేరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకూ వర్తింపజేయాలని పలమనేరు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద వారు కూటమి ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ, మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగంలో తాము రూ.13వేల జీతంతో పని చేస్తున్నామన్నారు. తమలాంటి పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయకుండా తొలగించడం చాలా బాధాకరమన్నారు. ఔట్‌సోర్సింగ్‌లో ఉన్నవారిపై సైతం ప్రభుత్వం కొరడా ఝళిపించిందని విమర్శించారు. పలువురు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

చీకటిరోజు గురించి తెలుసుకోవాలి

చిత్తూరు కార్పొరేషన్: దేశంలో 50 ఏళ్ల క్రితం విధించిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యంలో చీకటి రోజని బీజేపీ సీనియర్ నాయకులు చిట్టిబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అత్యయిక స్థితి అమలుతో 21 నెలల పాటు దేశంలో జరిగిన పర్యవసానాలపై యువత అవగాహన ఏర్పరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే జూన్ 25వ తేదీని సంవిదాన్ హత్యా దివస్ గా పరిగణిస్తున్నట్లు చెప్పారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణకు యువత పాటుపడాలన్నారు.

సుపరిపాలనతో దేశాభివృద్ధి

చిత్తూరు కార్పొరేషన్: ప్రధాని నరేంద్రమోదీ సుపరిపాలనతో దేశాభివృద్ధి సాధ్యమవుతోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. నగరంలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. కేంద్రంలో 11 ఏళ్ల బీజేపీ పరిపాలనలో సాధించిన అభివృద్ధి గురించి తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసన్, షణ్ముగం, ఓంకార్ పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే చర్యలు తప్పవు

తవణంపల్లె: హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ చిరంజీవి హెచ్చరించారు. పట్నం సమీపంలోని బ్రిడ్జి దగ్గర వాహనాలను మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. వాహనాలపైన ప్రెస్, డిపార్టుమెంట్ పేర్లు, స్టిక్కర్లు వేసుకొని నడుపుతున్న వారిని గుర్తించి జరిమానా వేశారు. రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన చరణ్



బంగారుపాళెం: మండలంలోని గుండ్లకట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్ఎం బేరీనాథ్ తెలిపారు. మండలంలోని వడ్డివారిచెరువు గ్రామానికి చెందిన సావిత్రి, శివ దంపతుల కుమారుడు టి చరణ్ గుండ్లకట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివాడని, 571 మార్కులు సాధించాడన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన చరణ్‌కు ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చిందన్నారు. విద్యార్థి చరణ్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా మాధవరం జాతర

మండల పరిధిలోని మాధవరంలో గంగమ్మ జాతర మంగళవారం వైభవంగా సాగింది. జెడ్పీ వైస్ చైర్మన్ బి.ధనుంజయరెడ్డి అమ్మవారికి సారెను సమర్పించారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. జెడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ ఎంపీపీ సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఏటా గంగ జాతర నిర్వహించడం అభినందనీయమన్నారు. – **యాదమరి**



అమ్మవారికి సారె తీసుకువస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి



అమ్మవారి సేవలో ఎంపీపీ సురేష్‌బాబు